క్లుప్తంగా

సైనికులకు సన్మానం



నర్సింహులపేట : ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న అనంతరం స్వగ్రామానికి విచ్చేసిన సైనికులు, కుటుంబ సభ్యులకు గురువారం మాజీ సైనికుడు, హైదరాబాద్‌లో పోలీస్ శాఖలో పని చేస్తున్న శివనాదుల శ్రీనివాస్ సన్మానం చేశారు. కొండ్రెడ్డి దేవేందర్‌రెడ్డి, ఊదరి యాకయ్య, మర్రి సుదర్శన్, గుండగాని నాగరాజులతో పాటుగా కుటుంబ సభ్యులను శాలువాతో శ్రీనివాస్ సన్మానం చేశారు. అనంతరం జాతీయ జెండాను నాగరాజు తండ్రి ఎల్లగౌడ్ ఎగురవేశారు. మాజీ సర్పంచ్‌లు బండ భిక్షంరెడ్డి, వేముల రజిత పాల్గొన్నారు.

జీపీకి ఫ్యాన్ల బహూకరణ

కురవి : సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామ పంచాయతీకి అదే గ్రామానికి చెందిన మాచర్ల బుచ్చమ్మ-రామయ్యల జ్ఞాపకార్థం వారి కుమారుడు మాచర్ల మల్సూర్ రెండు ఫ్యాన్లను గురువారం బహూకరించారు. పంచాయతీ కార్యదర్శి అశోక్, కాంగ్రెస్ నాయకులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



తొర్రూరు : ఇటీవల రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన సీఆర్పీ సర్వి రమేష్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గురువారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించారు. సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, తొర్రూరు ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డిలతో కలిసి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. నాయకులు అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, చెవిటి సదాకర్, దేవరకొండ శ్రీనివాస్, ఎక్కటి నాగిరెడ్డి, ధర్మారపు మహేందర్‌లు ఉన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



తొర్రూరు : పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ యాకూబ్ పేర్కొన్నారు. ఈమేరకు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. యాకూబ్ మాట్లాడుతూ...తొర్రూరు పట్టణంలోని గోపాలగిరి రోడ్డులో 240 ఇళ్లు నిర్మించి పేదలకు కేటాయించకుండా వదిలేశార ని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు మార్క సాంబయ్య, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, బోర స్వామి, కొత్త వెంకట్‌రెడ్డి, ఉమ్మగాని యాకయ్య, తిమ్మిడి రవి, ఎండీ నజీర్, శోభ, శ్రీలత, అరుణ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బావినీరు కలుషితం




మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ గ్రామంలో ప్రజలకు తాగునీరు సరఫరా చేసే నల్లాల బావినీరు కలుషితం అవుతున్నాయని స్థానికులు గురువారం తెలిపారు. జంగిలిగొండ పెద్ద చెరువులో ఓ నల్లాల బావి ఉండగా అందులో నుంచి మరో బావికి పైపులైన్ వేసి నీటిని తరలిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం పైపులైన్ పగిలిపోగా బావినీరు పెద్దచెరువు నీటిలో కలుస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలనున్న నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ నీరు వచ్చేదెలా?

- కూరుకుపోతున్న పెద్దచెరువు ఉపకాల్వ
- ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నర్సింహులపేట : మండలంలోని పెద్ద చెరువు సమీపం నుంచే ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ పోతున్న పక్కనే ఉన్న నర్సింహులపేట పెద్దచెరువుకు నీరు మాత్రం రాదు. ప్రధాన కాల్వ ఇరువైపులా ఉన్న గ్రామాల చెరువులు ఎస్సారెస్పీ నీటితో నిండుతున్న, పక్కనే ఉన్న పెద్దచెరువుకు నీళ్లు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో చెరువులు ఎస్సారెస్పీ నీటికి నోచుకోవడం లేదు. మండలంలో పెద్ద చెరువులోకి ఎస్సారెస్పీ నీరు రావడానికి పెద్దనాగారం శివారు తండాలకు వెళ్లే ఉప కాల్వ నుంచి మరో చిన్న కాలువను ఏర్పాటు చేసిన ఫలితం లేదు. కాల్వ పూర్తిగా తీయకపోవడంతో నీరు సక్రమంగా రావడంలేదు. దీంతో కాల్వ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఎన్నికల ముందు బీరిశెట్టిగూడెం శివారు పంతుల్‌తండా పక్కన ప్రధాన కాల్వ నుంచి పెద్ద చెరువుల్లోకి కాల్వ తీయాలని గ్రామస్తులు కోరడంతో నాయకులు సరే అన్నారు. గెలువగానే ఆ అంశాన్ని మరిచిపోవడం అనవాయితీగా మారిపోయింది.పెద్ద చెరువు కింద 600 ఎకరాల ఆయకట్టు, బందంచెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉంది. పెద్దచెరువులోకి నీరు వస్తే అవే నీళ్లు బందంచెరువు, వెంకమ్మ చెరువులోకి వెళ్తాయి. మండల కేంద్రంలోని చెరువులకు సాగునీరు వచ్చేలా ప్రత్యేకంగా కాల్వను తీయించాలని రైతులు, కూలీలు కోరుతున్నారు.



కాల్వలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లు

చెరువుకు నీరు వచ్చేలా చూడాలి



నర్సింహులపేట పెద్ద చెరువులోకి ఎస్సారెస్పీ నీళ్లు వచ్చేలా అధికారులు చూడాలి. ప్రధాన కాల్వ పక్కనుంచి వెళ్తున్న ఉప కాల్వలో చుక్కనీరు రావడం లేదు. కాల్వను శుభ్రంచేసి చెరువులోకి నీళ్లు వచ్చేలా చేసి ఇబ్బందులను తీర్చాలి.

- భూక్య శ్రీను, రైతు

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్

నెల్లికుదురు : అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని, మంజూరు కాని వారు ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ సూచించారు. మండలంలోని నైనాల, నల్లగుట్ట తండా, రత్తిరాం తండా, జామతండా, కాచికల్ గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలసి గురువారం ముగ్గు పోశారు. అనంతరం మంజూరు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై నిలిచి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. ఎంపీడీఓ బాలరాజు, తహసీల్దార్ చందా నరేష్, ఎంపీఓ పద్మ, నాయకులు ప్రభాకర్ గౌడ్, సత్యపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బాలాజీ నాయక్, వెంకటేష్, దేవేందర్ రెడ్డి, వంశీ, యాకయ్య, యాకసాయిలు, ఆకుల లింగయ్య, సమరం గౌడ్, రమేష్, రాజు, సురేష్, భిక్షపతి, వీరు పాల్గొన్నారు.



నెల్లికుదురు: కాచికల్‌లో ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

ప్రభుత్వ సూచనలు పాటించాలి

దంతాలపల్లి : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ సూచనలు పాటిస్తు ఇంటిని నిర్మించాలని హౌసింగ్ బోర్డు పీడీ రాజయ్య తెలిపారు. మండలంలోని కుమ్మరికుంట్లలో గురువారం నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఎంపీఓ అఫ్సర్‌పాషా, ఏఈ హేమా, కార్యదర్శి సృజన పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

కురవి : ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల స్పెషల్ అధికారి నర్సింహరావు, ఎంపీడీఓ వీరబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల పనులకు ముగ్గు పోశారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, సిబ్బంది నిపున్, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్, ఆలయ ధర్మకర్త చిన్నంగణేష్, తరాల వీరన్న పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణ వాసులకు మెరుగైన సేవలందించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. పట్టణ పరిధిలో నేరాల నియంత్రణే లక్ష్యంగా ముందుకు వెళ్తామని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ తమ వ్యాపార, వాణిజ్య సంస్థలు, వివిధ విభాగాల సంస్థల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టౌన్ ఎస్సైలు విజయ్ కుమార్, అలిమ్ హుస్సేన్, శివ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు టౌన్ ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ ఎన్నికల దృష్ట్యా టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి ఎలాంటి చట్ట వ్యతిరేక చర్యల్లో పాల్గొనవద్దని హెచ్చరించారు.

కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యల పరిష్కారం

తొర్రూరు : కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలు పరిష్కారం సాధ్యమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఓమ భిక్షపతి అన్నారు. డివిజన్ కేంద్రంలో గురువారం సీపీఐ పట్టణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అనంతరం సీపీఐ పట్టణ కమిటీని ప్రకటించారు. పట్టణ కార్యదర్శిగా ముద్రబోయిన వెంకన్న, సహాయ కార్యదర్శిగా పసుల యాకయ్యలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బందు మహేందర్, నాయకులు కిరణ్‌కుమార్, చంద్రయ్య, నరసింహారెడ్డి, భిక్షపతి, వెంకన్న, దేవేందర్‌లు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ యుద్ధాన్ని వెంటనే ఆపాలి



అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

- వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

నెహ్రూసెంటర్ : పాలస్తీనా పౌరులపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడుతూ సృష్టిస్తున్న మారణహోమాన్ని వెంటనే నిలిపి వేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయ్‌సారథి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇప్పటికే వేలాది మంది ప్రజలు మరణించారని, మహిళలు, పిల్లలు, శరణార్థులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం సరికాదన్నారు. ఇజ్రాయెల్ యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల నాయకులు అజయ్‌సారథి రెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, గునిగంటి రాజన్న, సమ్మెట రాజమౌళి, హేమానాయక్, ముస్తాఫా, రఫీ, హలావత్ లింగన్న, గుజ్జు దేవేందర్, నందగిరి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి రవి, ఎస్‌కె బాబు, తుడుం వీరభద్రం, బోనగిరి మధు, చైతన్య, సామ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడులను వెంటనే నిలిపివేయాలి

పాలస్తీనా, ఇరాన్‌లపై ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండను వెంటనే నిలిపివేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

మండల కమిటీ ఎన్నిక

నర్సింహులపేట : గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బారి రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కార్యదర్శిగా మంచాల శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా బాల్లె ఐలయ్య, జక్కుల శ్రీను, కోశాధికారిగా బెల్లి లింగమల్లు, సహాయ కార్యదర్శులుగా బొంతం రాములు, గజ్జే అర్జపతి, గౌరవ అధ్యక్షుడిగా గాడుదుల సోమలింగం, సభ్యులుగా చందు మల్లయ్య, రేఖ నర్సయ్య, ఐలయ్య, యాకసాయిలు, సతీష్, లింగయ్య, రాములు, కొమురయ్యను ఎన్నుకున్నారు.

వైద్యశిబిరం

పెద్దవంగర : మండలంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం కళాధర్ సమక్షంలో పల్లె దవాఖానా వైద్యురాలు సబితరాణి గురువారం వైద్యశిబిరం నిర్వహించారు.

జీపీ భవనాన్ని వినియోగంలోకి తేవాలి

చిన్నగూడూరు : మండలంలోని మేగ్యా తండాలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని అధికారులు ప్రారంభించి, స్థానికుల అవసరాలకు వినియోగంలోకి తేవాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు బాదావత్ సురేష్ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామారావు, ఎంపీఓ రజనికి వినతిపత్రం అందజేశారు.

బీమా చెల్లించడంలో అధికారుల నిర్లక్ష్యం

కేసముద్రం : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న కార్మికులకు ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన చెల్లించడంలో మార్కెట్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ఆరోపించారు. గురువారం మార్కెట్‌లో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆదర్శ కమ్యూనిస్టు లక్ష్మయ్య

నెహ్రూసెంటర్ : ఆదర్శ కమ్యూనిస్టు ఆకుల లక్ష్మయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం లక్ష్మయ్య వర్ధంతి సభను నిర్వహించారు.

ట్రెంచ్ ఏర్పాటు చేయాలి

గార్ల : పెద్దచెరువు శిఖం భూమికి హద్దులు గుర్తించి, ట్రెంచ్ ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజాపాలన పేరిట చట్టాల ఉల్లంఘన

గంగారం : ఆదివాసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న దమన నీతిని ఖండిద్దామని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగబోయిన రవి అన్నారు. గంగారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వలస వాద, గిరిజనేతర దోపిడీ వర్గాలకు భూ భారతి ద్వారా హక్కులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం వంటి చట్ట ఉల్లంఘనకు పాల్పడుతోందని పేర్కొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

గూడూరు : యోగాతో విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత కలిగి, ఒత్తిడి దూరమవుతుందని యోగా శిక్షకుడు దోసపాటి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బాలికల విద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా గురువారం అవగాహన కల్పించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

నెహ్రూసెంటర్ : ఆర్టీసీ ఉద్యమంలో భాగంగా నాయకులపై నమోదైన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. ఉద్యమ కేసులో భాగంగా కోర్టుకు గురువారం హాజరైన అనంతరం మాట్లాడారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి

పెద్దవంగర : నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఆర్సీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి మల్లేష్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అదనపు కలెక్టర్‌కు, డీఈఓకు వినతి పత్రం అందజేశారు.

నియామకం

గార్ల : ఆరోగ్యమిత్ర స్వచ్ఛంధ సంస్థ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా విశ్రాంత ఉపాధ్యాయుడు బేతి వెంకటేశ్వర్లును నియమించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ గురువారం తెలిపారు. వెంకటేశ్వర్లుకు స్థానిక ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

సికిల్ సెల్ నిర్మూలనకు కృషి

పెద్దవంగర /డోర్నకల్ : సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వడ్డెకొత్తపల్లి పల్లె దవాఖాన వైద్యుడు రాజ్‌కుమార్ ,చిలుకోడు ఆరోగ్య ఉపకేంద్రం ఎంఎల్‌పీహెచ్‌పీ సౌజన్య అన్నారు. గురువారం పెద్దవంగర మండలంలోని పోచారంలో సికిల్ సెల్ ఎనిమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొర్రూరు /నెల్లికుదురు / చిన్నగూడూరు : పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్‌లో ఎంఎల్‌టీ, అగ్రికల్చర్, క్రాప్ ప్రొడక్షన్ కోర్సులో ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేయడానికి మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి బి. శైలజ, నెల్లికుదురు కేజీబీవీ ప్రత్యేక అధికారి సుమలత, చిన్నగూడూరు ఎస్‌ఓ లలిత ఒక ప్రకటనలో తెలిపారు.

గుంత పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్..

బయ్యారం : ప్రమాదకరంగా ఉన్న గుంతను అధికారులు మట్టితో పూడ్చివేశారు. 'రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని బాలాజీపేట-వెంకట్రాంపురం రహదారిపై సాయికుంట వద్ద ఏర్పడిన గుంతను మట్టితో పూడ్చివేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కేసముద్రం : రైతుభరోసా కింద మండలానికి చెందిన 13,620 మంది రైతులకు రూ.11.83 కోట్లు వారి ఖాతాల్లో జమచేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు.అలాగే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, రావుల మురళీ, కదిర సురేందర్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు వోలం రమేష్, చిదురాల వసంతరావు, ఎండి.అయూబ్‌ఖాన్, యాదగిరి, నాగరాజు, వెంకట్‌రెడ్డి, కొండ సురేష్, గణేష్, ముజ్జు, బానోత్ వెంకన్న, యాకాంతాచారి, వెంకన్న పాల్గొన్నారు.

కిచెన్ షెడ్డు ధ్వంసం



ధ్వంసం చేసిన ప్రాంతంలో పరిశీలిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, తదితరులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని అమనగల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న కిచెన్ షెడ్డు నిర్మాణాన్ని కొందరు ధ్వంసం చేశారని మాజీ సర్పంచ్ పూజారి మంగమ్మవెంకన్న గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన ఇస్లావత్ హరి, లక్ష్మా, బాలు, నరసింహ, సేవాలాల్, రమేష్, బానోత్ భద్రు, మరికొందరు కిచెన్ షెడ్డు నిర్మాణ పనులను ధ్వంసం చేశారన్నారు. ఇనుప రాడ్లు, సిమెంటు బస్తాలు ఎత్తుకు పోయారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

కుల దైవం స్థలంలో నిర్మాణ పనులు..

కాగా అమనగల్ మాజీ సర్పంచ్ పూజారి మంగమ్మ వెంకన్న చేస్తున్న ఆరోపణలు అసత్యమని బలరాం తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ నీలవేణిహరి అన్నారు. తమ కుల దైవం జెండాలు ఉన్న స్థలం ప్రాంతంలో పాఠశాల కిచెన్ షెడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆరోపించారు. ఆ స్థలం తమ గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుందని, గతంలోనే అక్కడ ఎలాంటి పనులు చేయొద్దని వారితో చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. తమ దేవాలయానికి సంబంధించిన స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఆదర్శ నాయకుడు రాహుల్ గాంధీ



తొర్రూరు: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



మరిపెడలో స్వీట్లు పంచుకుంటున్న నాయకులు




గార్ల: కేక్ కట్ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ దుర్గాప్రసాద్

సాక్షి నెట్‌వర్క్ : దేశ రాజకీయాలను మార్చుతున్న ఆదర్శ నాయకుడు రాహుల్‌గాంధీ అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఆయా పార్టీ కార్యాలయాల్లో నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. రాహుల్ నాయకత్వం దేశ భవిష్యత్‌కు అవసరమని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గూడూరు : రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అనారోగ్యంతో జీపీ కార్మికుడి మృతి



వెంకన్న (ఫైల్)

గూడూరు : గూడూరు గ్రామ పంచాయతీకి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కొమ్ముల వెంకన్న (49) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సహోద్యోగులతో పాటు కాంగ్రెస్ నాయకులు వెంకన్న మృతి పట్ల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనకు భార్యతో పాటు కొడుకు, కూతురు ఉన్నారు.

కూలికి వెళ్లి అనంతలోకాలకు..



అమీర్య మృతదేహం

మరిపెడ : మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఖమ్మం జిల్లాకు కూలికి వెళ్లి గుండెపోటుతో మృతి చెందాడు. మూలమగ్రితండా పరిధిలోని అమీర్య తండాకు చెందిన వాంకుడోత్ అమీర్యా (35) కుటుంబ పోషణ నిమిత్తం మరిపెడలో అద్దెకు ఉంటున్నాడు. రోజువారీగా ఖమ్మం జిల్లాలో సుతారీ పనికి వెళ్లగా గురువారం అమీర్యాకు ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో తోటివారు ఆస్పత్రికి తీసుకు వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..


బయ్యారం : బైక్ పై నుంచి పడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండల పరిధిలోని సుద్దరేవులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఈసం వెంకన్న(47) బుధవారం నామాలపాడులో ఓ శుభకార్యానికి బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో మూలపోచారం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డోర్నకల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన పేరం విజయ్‌కుమార్ బంధువులతో కలిసి ఆటోలో ఈ నెల 17వ తేదీన కురవి వీరభద్రస్వామి ఆలయానికి వచ్చి దర్శనం చేసుకున్నారు. తిరుగు ప్రయాణంలో సీరోలు మండలం మన్నెగూడెం సమీపంలో మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో విజయ్‌కుమార్‌కు తీవ్ర గాయలు కాగా సోదరి భద్రమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. బుధవారం జగ్గయ్యపేటలోని ఆస్పత్రిలో చికిత్స అందించేందుకు తరలిస్తుండగా విజయ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి సోదరి భద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమ తెలిపారు.


వాహనం ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలు

గార్ల : గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం దుబ్బగూడెంలో చోటుచేసుకుంది. బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన శ్రీదేవి గార్ల మండలంలోని దుబ్బగూడెంలో రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు వైద్యుడు హనుమంతరావు తెలిపారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికలు



కురవి: పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు



డోర్నకల్ జెడ్పీఎస్ఎస్‌లో..

పెద్దవంగర/కురవి/ గూడూరు/ మరిపెడ/ డోర్నకల్/ కేసముద్రం: హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ క్రీడా పాఠశాలల్లో నాల్గో తరగతిలో ప్రవేశాలకు మండల స్థాయిలో ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు నిర్దేశించిన ఫిజికల్ టెస్టులు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. షటిల్ రన్, 30 మీటర్ల పరుగు, ఫ్లెక్సిబిలిటీ, బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, బాల్ త్రో వంటి క్రీడలు నిర్వహించారు. పెద్దవంగర ఎంఈఓ బుదారపు శ్రీనివాస్, సీరోలు, కురవి ఎంఈఓలు ఇస్లావత్ లచ్చిరాం నాయక్, వి.బాలాజీ నాయక్, గూడూరు ఎంఈఓ రవికుమార్, మరిపెడ మండల విద్యాశాఖాధికారి అనితాదేవి, కేసముద్రం ఎంఈఓ కాలేరు యాదగిరిలు పాల్గొని మాట్లాడారు. ఆయా మండలాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయిలో ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు ఈ నెల 24వ తేదీన జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి జ్యోతి గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు కుల, ఆదాయం, నివాసం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పత్రంతో ఎంపిక పోటీలకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు 9440630681 నంబర్‌ను సంప్రదిచాలన్నారు.

ఆధార్ నంబర్‌పై కేసులు నమోదయ్యాయని..

- రూ.1.22 లక్షలు స్వాహా

మహబూబాబాద్ రూరల్ : మీ ఆధార్ నంబర్‌పై కేసులు నమోదయ్యాయని సైబర్ నేరగాళ్లు చెప్పిన మాటలు నమ్మి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.1.22 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. టౌన్ ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి గురువారం కేసు వివరాలను వెల్లడించారు. స్థానిక ఉపాధ్యాయుడికి 90464 21892 నంబర్ నుంచి ఫోన్ చేసి డీఓటీ శాఖ నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. మీ ఆధార్ కార్డును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వాడుకుని దాని ఆధారంగా సిమ్‌లు తీసుకుని వాడుతున్నారని, 7 కేసులు కూడా అయ్యాయని పేర్కొన్నారు. మీరు బెంగళూరు అశోక్ నగర్ పోలీస్ స్టేషనుకు ఫోన్ చేసి వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకోండి అని చెప్పి, మీపై అరెస్ట్ వారెంట్ ఇష్యూ అయిందని చెప్పారు. అందుకు ఖర్చు అవుతాయని మాటలు చెప్పి నమ్మించి అతడి వద్ద నుంచి రూ.1.22 లక్షలను ఫోన్ పే ద్వారా బదిలీ చేయించుకున్నారు. దీంతో ఆయన సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.